జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 23-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 653 పేజీలు: 4 వెల : రూ.7




# విద్యార్థినులపై.. వేధింపులు

✳ అధ్యాపకులపై కళాశాల విద్యాశాఖకు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు
✳ ఆమదాలవలస ప్రభుత్వడిగ్రీ కళాశాలలో ఆర్‌జేడీ విచారణ
✳ తక్షణం చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల డిమాండ్
✳ జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశం

**శ్రీకాకుళం/ఆమదాలవలస, ఏప్రిల్ 22 (వార్త):** ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధిస్తున్న ఇద్దరు అధ్యాపకులు తమను వేధిస్తున్నారంటూ కొందరు విద్యార్థినులు ఇటీవల కళాశాల విద్యాశాఖ కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. తరగతి గదుల్లో అనుచితంగా వ్యవహరిస్తున్నారని, మానసికంగా వేధిస్తున్నారని, భయాందోళనకు గురిచేస్తున్నారని కొందరు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌జేడీ పీవీ కృష్ణాజీ బుధవారం ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విచారణ చేపట్టారు. తరగతి గదుల్లోకి వెళ్లి వివరాలు సేకరించారు. 16 ప్రశ్నలతో కూడిన పత్రం ఇచ్చి విద్యార్థుల నుంచి వివరాలను స్వీకరించారు. ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని, నిర్భయంగా సమాధానాలు చెప్పాలని విద్యార్థినులకు సూచించారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులతో ఆర్‌జేడీ సమావేశమై ఈ అంశంపై చర్చించారు. విద్యార్థినులపై వేధింపుల విషయమై మీడియా ప్రతినిధులు ఆర్‌జేడీని వివరణ కోరారు. ఇద్దరు అధ్యాపకులు వేధిస్తున్నారని కొందరు విద్యార్థినులు కమిషనర్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. వారి ఆదేశాల మేరకు విచారణ చేపట్టానని, పూర్తి నివేదికను కమిషనర్‌కు అందజేస్తామన్నారు. ఏదేమైనప్పటికీ విద్యార్థినులపై అనుచితంగా ప్రవర్తిస్తున్న అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలతో పాటు తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. మార్గదర్శకంగా ఉండాల్సిన కొందరు అధ్యాపకులే ఇలా ఉంటే ఎవరిని నమ్మాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## స్లీప్ మోడ్‌లో ఉపాధ్యాయుడు..!



**మెళియాపుట్టి, ఏప్రిల్ 22 (వార్త):** మెళియాపుట్టి మండలంలోని నరసంద్ర పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు తరగతి గదిలో కుర్చీలో కూర్చొని టేబుల్‌పై కాలువేసుకుని నిద్రపోతున్న ఫొటో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ అయింది. విద్యార్థులకు బోధించాల్సిన ఉపాధ్యాయుడు తరగతి గదిలో నిద్రపోతుండడంతో కొందరు చూసి క్లిక్ మనిపించి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో ఇది వైరల్‌గా మారింది. గతంలోనూ ఇలానే ఈ ఉపాధ్యాయుడు నిద్రపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరికలు చేశారు. అయినప్పటికీ పట్టించుకోకపోవడంతో తల్లిదండ్రులు తమ సెల్‌ఫోన్‌కు పనిచెప్పారు. అయితే ఆ ఉపాధ్యాయుడు అనారోగ్యంతో బాధపడుతుండడంతో కొద్దిసేపు నిద్రపోతున్నాడని ఎంఈవో మల్లారెడ్డి పద్మనాభం వివరణ ఇచ్చారు. గతంలో కూడా ఈ అంశం తన దృష్టికి వచ్చిందని, హెచ్చరికలు కూడా చేశానన్నారు.

## వడగాలులలతో అప్రమత్తం

✳ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 22 (వార్త):** జిల్లాలో వేసవి తాపం ఒక్కసారిగా పెరిగిందని, గురువారం నుంచి వడగాల్పులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గత 24 గంటల్లో ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గురువారం నుంచి ఉష్ణోగ్రతలు 42 నుండి 44 డిగ్రీలకు ఉష్ణోగ్రతలుపెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిందన్నారు. శ్రీకాకుళం, రాజాం, కళింగపట్నం, ఎచ్చెర్ల, గార, లావేరు, రణస్థలం, జి.సిగడాం, పొందూరు, సంతకవిటి, చీపురుపల్లి, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, హిరమండలం, నరసన్నపేట మండలాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప వృద్ధులు, గర్భిణీలు చిన్న పిల్లలు బయటకు రావద్దని సూచించారు.

# ఇద్దరు ఎస్ఐలకు బదిలీ





**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 22 (వార్త):** జిల్లాలో ఇద్దరు ఎస్ఐలకు బదిలీ అయింది. దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఉన్న చంద్రకళను శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐగా, రెండో పట్టణ ఎస్ఐగా ఉన్న లక్ష్మీకి జిల్లా పోలీసు కార్యాలయంలోని ఓ విభాగానికి సీ నంబరుపై బదిలీ చేస్తూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 2020 బ్యాచ్‌కు చెందిన చంద్రకళ కొత్తూరు, దిశ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించారు. ఈమె స్వస్థలం విశాఖ జిల్లా అనకాపల్లి. అయితే జిల్లాలో కొంతమంది ఎస్ఐలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మరికొందరికి బదిలీ అయ్యే అవకాశం ఉందని పోలీసు వర్గాల్లోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లా పోలీస్‌బాస్ కూడా వారిపై గుర్రుగా ఉన్నట్టు తెలుస్తోంది.




✳ రెండో పట్టణ ఎస్ఐగా చంద్రకళ ✳ జిల్లా పోలీసు కార్యాలయానికి లక్ష్మీ ✳ సీ నంబర్‌పై అటాచ్ చేసిన ఎస్పీ


ఫిర్యాదు తీసుకోను.. ఏం చేసుకుంటారో..

చేసుకోండి

✳ నేను ఎవరికీ భయపడను
✳ నాకు ఉన్నతాధికారుల అండ ఉంది
✳ ఫిర్యాదు కాపీని ఫిర్యాదుదారునిపై విసిరికొట్టిన టు టౌన్ ఎస్ఐ లక్ష్మీ
✳ ఆర్మీ హావాల్దార్‌పై రుసరుసలు
✳ ఇదేనా ఫ్రెండ్లీ పోలీసింగ్.. అంటూ ఫిర్యాదుదారుడి ఆవేదన
✳ పీఎస్‌లో సీసీ కెమెరాలు పరిశీలిస్తే నిజాలు బట్టబయలు
✳ ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్న ఫిర్యాదుదారుడు (ఆర్మీ హావాల్దార్)
✳ జిల్లాలో ఒకరిద్దరు ఎస్ఐల తీరుపై విమర్శలు
✳ సారవకోట ఎస్ఐపై కలెక్టర్‌కు సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ ఫిర్యాదు
✳ కొందరి వల్ల జిల్లా పోలీసు శాఖకు మచ్చ

శ్రీకాకుళం క్రైం, మార్చి 23 (వార్త): పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారితో మర్యాదగా వ్యవహరించాలి.. వారిని కూర్చోబెట్టి సమస్యను సావధానంగా వినాలి.. వారికి న్యాయం జరిగేలా చూడాలి.. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు కావాలి.. అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి జిల్లా పోలీసులకు సూచిస్తున్నా.. కొందరు మాత్రం తమ తీరును మార్చుకోవడం లేదు. కొందరు ఎస్ఐలు అక్రమాలు, అవినీతి, దందాలకు పాల్పడినట్టు తన దృష్టికి వస్తే వెంటనే వీఆర్‌కు ఎస్పీ పంపిస్తున్నారు. అయినప్పటికీ జిల్లాలోని ఒకరిద్దరు ఎస్ఐల దురుసు ప్రవర్తన వల్ల జిల్లా పోలీసు శాఖకు మచ్చ తెస్తోంది. సారవకోట ఎస్ఐ అనిల్ కుమార్‌పై.. సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ ఏకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ లక్ష్మీ తీరుపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారిపై ఆమె చిందులు వేయడం, ఫిర్యాదు తీసుకోనని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని, ఏం చేసుకుంటారో చేసుకోండని రుసరుసలాడడం చర్చనీయాంశమైంది. తన కుమారుడిపై ఓ వ్యక్తి దాడి చేయడంతో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఓ ఆర్మీ అధికారి (హావల్దార్)పైనే ఎస్ఐ లక్ష్మీ చిందులేయడంతో ఆయన అవాక్కయ్యాడు. దీనిపై హావల్దార్.. ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

అసలేం జరిగింది..

శనివారం సాయంత్రం శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఓ బాలుడు సైకిల్ తొక్కుతున్నాడు. అదే మార్గంలో వెళుతున్న స్కూటర్‌పై వెళుతున్న వాహనచోదకుడికి అడ్డంగా ఈ బాలుడు వచ్చాడు. దీంతో వాహనచోదకుడు ఆ బాలుడిపై చేయిచేసుకున్నాడు. ఈ విషయాన్ని ఆ అబ్బాయి తండ్రి ఆర్మీ అధికారి (హావల్దార్)కు తెలియజేశాడు. దీంతో హావల్దార్ ఇదే విషయమై వాహనచోదకుడిని నిలదీశారు. దీంతో వాహనచోదకుడు పరుష పదజాలం వాడడంతో.. అదేరోజు రాత్రి శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హావల్దార్ ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మీ ఆ ఫిర్యాదును పరిశీలించారు. న్యాయం చేయాల్సిన ఎస్ఐ ఆ ఫిర్యాదు కాపీని విసిరికొట్టారని, చిన్నచిన్న తగువులకు సైతం స్టేషన్‌కు రావాలా అని, కేసు కట్టనని, ఏం చేసుకుంటారో చేసుకోండని, తాను ఎవరికీ భయపడేది లేదని, తనకు ఉన్నతాధికారులతో పరిచయాలు ఉన్నాయని మండిపడినట్టు హావల్దార్ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో హావల్దార్ వెంటనే ఫిర్యాదు కాపీని పట్టుకుని ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ నుంచి బయటకు వచ్చారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సీఐ ఈశ్వరరావు దృష్టికి హావల్దార్ తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి వాహనచోదకుడిని మందలించారు. ఇరువురికీ సర్దిచెప్పి పంపించివేశారు.

సీసీ కెమెరాలు పరిశీలిస్తే..

ఎస్ఐ లక్ష్మీ తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే వారిపై ఎస్ఐ ఇలా వ్యవహరించడం ఎంతమాత్రం తగదని హావల్దార్ వాపోయాడు. తనపైనే ఆమె ఇలా వ్యవహరిస్తే సామాన్య ప్రజలకు ఆమె ఏం న్యాయం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి ఎనిమిది నుంచి తొమ్మిది గంటల మధ్యలో స్టేషన్‌లో ఏం జరిగిందన్నది సీసీ కెమెరాలు పరిశీలిస్తే నిజాలు బయటపడతాయన్నారు. ఈ విషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తానని హావల్దార్ 'జాతీయ వార్త'కు తెలియజేశారు.

సారవకోట ఎస్ఐపై చర్యలు తీసుకోండి

✳ జిల్లా కలెక్టర్‌కు సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ వినతి

సారవకోట మండలం, వసలోవ గ్రామానికి చెందిన 70 ఏళ్ల గిరిజన వృద్ధుడు మూలవ కారయ్య, అతని భార్యపై కొందరు దాడులకు పాల్పడుతున్నారని, సారవకోట ఎస్ఐ సైతం దాడులకు పాల్పడుతున్న వారికే కొమ్ముకాస్తున్నారని, తక్షణం అతనిపై చర్యలు తీసుకోవాలని సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి జామాన రామారావు మాట్లాడుతూ, చట్టాన్ని రక్షించాల్సిన ఎస్ఐ అక్రమార్కులకు వత్తాసు పలకడం దారుణమన్నారు. కారయ్యకు ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన గార జాలికి, సోమేసు, నీలయ్య, చెట్టి కృష్ణారావు ఆక్రమించేశారన్నారు. దీనిపై ప్రశ్నించినందుకు గాను వృద్ధ దంపతులపై వారు భౌతిక దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడు సారవకోట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎస్ఐ జి.అనిల్ కుమార్ నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. పైగా బాధితులనే భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత దుర్మార్గమన్నారు. బాధితులకు న్యాయం జరగని పక్షంలో సోషల్ జస్టిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్త ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సొసైటీ జిల్లా అధ్యక్షులు బలగ రామారావు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సాము హిరణ్య రావు, ఆర్‌టీఐ జిల్లా ఇన్‌చార్జ్ [illegible] రామకృష్ణ, లోకొండ సర్పంచ్, ఇతర సభ్యులు ఉన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎస్పీ

పబ్లిక్ గ్రీవెన్స్‌లో స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పట్ల ఎటువంటి జాప్యం లేకుండా, నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన విచారణ జరిపి, అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తి స్థాయిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 55 మంది ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వాటిని సమగ్రంగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా వేగవంతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ సూచించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## తల్లిదండ్రుల బాధ్యతతోనే విద్యార్థుల భవిష్యత్

**- సత్యవరం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం**

**నరసన్నపేట, ఏప్రిల్ 22 (వార్త):** విద్యార్థుల భవిష్యత్తు వారి తల్లిదండ్రులపైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుందని రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయభాస్కర్ తెలిపారు. బుధవారం నరసన్నపేట మండలం సత్యవరం జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాసం, ప్రవర్తనపై తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా పనిచేస్తే, తల్లిదండ్రులు పిల్లలను సరైన దిశగా నడిపించే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులను మంచి భవిష్యత్తు వైపు తీసుకెళ్లడంలో ఇరువురి సమన్వయం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ దాలినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పించండి



**మందస, ఏప్రిల్ 22(వార్త):** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి, వారి భవిష్యత్‌కి బంగారు బాటలు వేయాలని కొత్తపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వేణుగోపాలరావు కోరారు. మందస మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు సంయుక్తంగా బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి గ్రామంలోని పుర వీధుల్లో ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా కొత్తపల్లి పాఠశాలల ప్రత్యేకతలు, పాఠశాల ప్రతీ ఏడాది సాధిస్తున్న విజయాలు ప్రజలకు వివరించారు. కార్యక్రమం లో కొత్తపల్లి ఉన్నత పాఠశాల పీఎంసీ ఛైర్పర్సన్ ప్రతినిధి కోమటి తిరుపతిరావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మెట్ట దామోదరం, ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం చిత్రసేను, జి.సూర్యనారాయణ, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, పి.అఖిల, పాఠశాల విద్యార్థులు, స్థానిక అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన అవసరం

**- నరసన్నపేట జూనియర్ కళాశాలలో**

**ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం**



**నరసన్నపేట, ఏప్రిల్ 22 (వార్త):** బాల్య వివాహాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శోభారాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మరపట్ల పవన్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది జనార్ధనరావు తెలిపారు. బుధవారం నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు బాల్య వివాహాల దుష్పరిణామాలు వివరించారు. చట్టపరమైన నిబంధనలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. యవ్వన దశలో బాలికలను మోసగించి లోబరుచుకునే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పల్లిపేట-సత్యవరం రోడ్డులో అధ్వానంగా డ్రైనేజీ

**-ఆరేళ్లుగా శుభ్రం చేయకపోవడంతో ప్రజల్లో ఆందోళన**



**నరసన్నపేట, ఏప్రిల్ 22 (వార్త):** పల్లిపేట జంక్షన్ నుంచి సత్యవరం జంక్షన్ వరకు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు సంవత్సరాలుగా డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయకపోవడంతో చెత్త, మురుగు పేరుకుపోయి దుర్వాసనతో పాటు దోమల పెరుగుదలకు కారణమవుతోందని తెలిపారు. దీనివల్ల స్థానికులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు, జిల్లా స్థాయి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వెంటనే స్పందించి డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరచి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## మెప్మా విభాగము ప్రత్యేక ప్రాజెక్టులకు దరఖాస్తులహ్వానం

**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలకసంఘ పరిధిలోని స్వయం సహాయక సంఘాల (ఎస్ హెచ్ జి ఎస్) అర్హత కలిగిన సభ్యులకు తెలియజేయునది ఏమనగా, మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న క్రింది ప్రత్యేక ప్రాజెక్టులలో భాగస్వామ్యమవ్వుటకు దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవని పలాస మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రత్యేక ప్రాజెక్టులకు గాను ఆరకు కాఫీ, చాయ్ రాస్తా, తృప్తి కాంటీన్, మిల్లెట్ మార్ట్స్, మైక్రో కిరాణా షాపులు, రీచ్ మై స్టోర్, ఎంబ్రాయిడరీ & ఫ్యాషన్ డిజైనింగ్ బుటిక్స్, స్మార్ట్ స్ట్రీట్స్ / ఈట్ స్ట్రీట్స్, బ్యూటీ & వెల్నెస్ కు సంబంధించిన దరఖాస్తులను కోరారు. ఇందుకు కావలసిన అర్హతలు మెప్మా పరిధిలో నమోదైన సంఘ సభ్యులు కావాలి. ఆసక్తి, వ్యాపార నైపుణ్యాలు కలిగి ఉండాలి. సంబంధిత ప్రాజెక్టుకు తగిన సామర్థ్యం కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తు విధానం ఆసక్తి గల అర్హత ఉన్న సంఘ సభ్యులు తమ వివరాలతో సహా దరఖాస్తులను పలాస మెప్మా కార్యాలయానికి వ్యక్తిగతంగా వచ్చి సమర్పించగలరని వెల్లడించారు. సంప్రదించవలసిన స్థలం మెప్మా కార్యాలయం, పలాస-కాశీబుగ్గ పురపాలకసంఘము కమిషనర్ పలాస-కాశీబుగ్గ పురపాలకసంఘమని ఒక ప్రకటన తెలిపారు.

# కార్పొరేట్‌కు ధీటుగా గోవిందపురం పాఠశాల

**వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 22 (వార్త):** గోవిందపురంలోని మండల ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా బుధవారం నిర్వహించారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుకలు ఉత్సాహభరితంగా కొనసాగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక విధానాలతో ముందుకు సాగుతున్నాయని అభినందించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం కూడా పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పనలో ముందంజలో ఉందని తెలిపారు. వేసవికాలంలో విద్యార్థులు అనవసరంగా ఎండలో తిరగకుండా, మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉండి పుస్తకాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కొత్త విషయాలను నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలను సాధించవచ్చని ప్రేరణనిచ్చారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన వివిధ క్విజ్ పోటీలలో ఈ పాఠశాల విద్యార్థులు మొదటి, ద్వితీయ బహుమతులు అధికంగా సాధించడం పాఠశాల ప్రతిష్టను పెంచిందని పేర్కొన్నారు. విద్యార్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే విధంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి తోడ్పడిన దాతలను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ శ్రీను, గ్రామ పెద్దలు కొంచాడ గోవిందరావు, కొంచాడ ధర్మారావు, ఉత్తరాల బాలరాజు, యువతరం సేవా సంస్థ సభ్యులు మురళి, పృథ్వీ, టీడీపీ నేతలు తుంభనాథం, పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీటీపీసీ కీలక నిర్ణయాలకు ..

# బోర్డు ఆమోదం




**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ 64వ బోర్డు సమావేశం బుధవారం సాయంత్రం మంగళగిరిలోని కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ వజ్జ బాబూరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 63వ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించి, పలు అంశాలకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్. హనుమంతరావుని (డిప్యూటీ సెక్రటరీ, ఇండస్ట్రీస్ & కామర్స్ డిపార్ట్‌మెంట్) ఏపీటీపీసీ బోర్డులో డైరెక్టర్‌గా నియమించిన విషయాన్ని సభ్యులకు తెలియజేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నామినేషన్ జరిగినట్లు పేర్కొన్నారు. ఏపీటీపీసీ ద్వారా ముడి సరుకులు, స్టేషనరీ సరఫరాలు, డీజీపీ కార్యాలయానికి రిజిస్టర్ల సరఫరా కోసం విడుదల చేసిన ఈ-టెండర్లను బోర్డు పరిశీలించి ఆమోదిస్తూ, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు ఏపీటీపీసీ సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తద్వారా కార్పొరేషన్ కు ఆదాయ వనరులు మెరుగుపడతాయని అన్నారు. ఎం /ఎస్ తజా అగ్రి ప్రొడక్ట్స్ తో కుదిరిన ఒప్పంద గడువును మరో రెండు నెలల పాటు పొడిగించేందుకు ఆమోదం తెలిపారు. విశాఖపట్నం ఎండాడ, సర్వే నం.1లో ఎం /ఎస్ పీవీర్ స్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో దీనా బిఓటి మోడల్‌లో హోటల్/కామర్షియల్ కాంప్లెక్స్ (జి ం5 నుండి జి ం10 అంతస్తులు) నిర్మాణం కోసం కుదిరిన లీజ్ ఒప్పందాన్ని బోర్డు ఆమోదించింది. అదనపు పనుల కోసం ఎం /ఎస్ క్రియేటివ్ టెక్నామాట్స్ తో సప్లిమెంటరీ ఒప్పందం చేసుకోవాలని, పనులను జూన్ 30, 2026 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, చర్చించి సమావేశంలో తీర్మానం చేశారు. 31.03.2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్పొరేషన్ ఆర్థిక నివేదికలను పరిశీలించి ఆమోదించేందుకు తీర్మానం చేశారు. కార్పొరేషన్ కార్యకలాపాలు, ప్రాజెక్టుల అమలు, ఆర్థిక నిర్వహణపై బోర్డు ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమావేశం స్పష్టం చేసింది. సమావేశానికి చైర్మన్ వజ్జ బాబూరావుతో పాటు వైస్ చైర్మన్ & ఎండీ శేఖర్ బాబు ( ఐఎఫ్ఎస్), ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ ఆదినారాయణ, జేడి ఏపీఐఐసీ (ఓఎస్ డి ) సుధాకర్, ఏపీటీపీసీ జీఎం హనుమ నాయక్, కంపెనీ సెక్రటరీ కరుణాకర్, అకౌంట్స్ మేనేజర్ శ్రీరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# టమోత..!

**-ఎగబాకుతున్న ధరలు**

**-నిరాశ నుంచి ఉత్సాహంలోకి రైతులు**

**సోంపేట, ఏప్రిల్ 22(వార్త):** టమాటా రైతుల్లో మళ్లీ ఉత్సాహం ఉప్పొంగుతుంది. మొన్నటివరకు ధరల విషయంలో నిరాశ చెందిన ఎదుర్కొన్న రైతులు.. ప్రస్తుతం నష్టాలు బాట నుంచి ఒడ్డెక్కే పరిస్థితులు నెలకొన్నాయి. గత నెలలో ఉన్న బాక్స్ టమాట ధర 70 రూపాయలు నుంచి ప్రస్తుతం 400 రూపాయలు వరకు వెళ్తోందని రైతులు ఆనందం వ్యక్తం జేస్తున్నారు. అయితే ఈ పరిస్థితి సోంపేట మండలం బారువా వంటి ఒకటి రెండు గ్రామాల వరకే పరిమితం. మిగతా గ్రామాలైన జింకిభద్ర, బెంకిలి, పలాసపురం వంటి గ్రా మాల్లో గత నెలలో కురిసిన భారీ వడ గండ్ల వానకు పంట నేల పాలైన పరిస్థితి అందరికీ విదితమే. పెట్టుబడులు కూడా రైతులకు దక్కని పరిస్థితి. ఏది ఏమైనా కొద్ది మంది రైతులు ఇటువంటి ధరలు పొందడం హర్షించదగ్గ విషయం.



## శక్తి యాప్‌పై అవగాహన

**-విద్యార్థులకు మార్గనిర్దేశం**

**- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచన**



**జలుమూరు, ఏప్రిల్ 22 (వార్త):** విద్యార్థులు చదువులో రాణించాలని టెక్కలి డివిజన్ శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ ఎం.గిరిధర్ సూచించారు. బుధవారం జలుమూరు మండలం రావిపాడు ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ సేవలు, అత్యవసర సమయంలో ఉపయోగపడే యాప్ ప్రయోజనాలను వివరించారు. మోసాలకు గురికావద్దని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. బాలికలు, మహిళలు చట్టాలపై అవగాహన పెంపొందించుకుని తమ రక్షణ కోసం శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులపై అవగాహన ర్యాలీ

**- అల్లాడలో విద్యార్థులు, తల్లిదండ్రుల భాగస్వామ్యం**



**జలుమూరు, ఏప్రిల్ 22 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, నాణ్యమైన విద్యా బోధనపై అవగాహన కల్పించేందుకు జలుమూరు మండలం అల్లాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం సీపాన రామచంద్రరావు నాయకత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి పాల్గొన్నారు. గ్రామంలో నినాదాలు చేస్తూ ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ర్యాలీలో తల్లిదండ్రులు కూడా పాల్గొనడం ఆనందదాయకమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకుని పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించాలని కోరారు.

## సెల్ఫ్ ఎన్యూమరేషన్‌పై అవగాహన

**- డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డెమో**



**నరసన్నపేట, ఏప్రిల్ 22 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పెద్దాడ లత విద్యార్థులకు జనాభా లెక్కల ప్రక్రియపై వివరించారు. చరవాణి ద్వారా సెన్సస్ వివరాలను ఎలా నమోదు చేయాలో డెమో రూపంలో చూపించారు. చిన్న చిన్న ప్రశ్నల ఆధారంగా జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సెన్సస్ కార్యక్రమం సమాజ అభివృద్ధికి ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మబగాంలో ఆలయాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు

**- పాల్గొన్న మాజీ మంత్రులు ధర్మాన సోదరులు**

**పోలాకి, ఏప్రిల్ 22(వార్త):** మబగాంలోని శ్రీ వల్లభనారాయణస్వామి, శ్రీ ఉమా మహాదేవ స్వామి వారి ఆలయాలలో పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించడం గ్రామాభివృద్ధికి, ఆధ్యాత్మిక వాతావరణానికి దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. గ్రామస్థుడిగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా వారు తెలిపారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రాజకీయ ఉనికి కోసమే బాబా తాపత్రయం

**-పలాస టీడీపీ నాయకుల ధ్వజం**



**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** రాజకీయ ఉనికి కోసమే దువ్వాడ శ్రీధర్ (బాబా) తాపత్రయం పడుతున్నారని పలాస టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. పలాస టీడీపీ కార్యాలయంలో మున్సిపాలిటీ ముఖ్యనాయకులు బుధవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాజకీయ ఉనికి కోసమే దువ్వాడ శ్రీధర్ (బాబా) పలాస జిల్లా అంశాన్ని తెరపైకి తెస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని, ఆయన వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. రాజకీయ లబ్ధి కోసమే దువ్వాడ శ్రీధర్ (బాబా) ఈ డ్రామాలు ఆడుతున్నారని, ప్రస్తుతం వైసీపీలో తన ఉనికిని చాటుకోవడానికి, ప్రజల సానుభూతి పొందేందుకు దువ్వాడ శ్రీధర్ లేనిపోని అంశాలను ప్రజలపై రుద్దుతున్నారని మండిపడ్డారు. జిల్లా ఏర్పాటు అనేది ఒక సుదీర్ఘమైన ప్రక్రియని తెలిసి కూడా, ప్రజల్లో ఆందోళన కలిగించేలా వ్యవహరించడం ఆయన రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని వారు తెలిపారు. పలాస జిల్లా ఏర్పాటు దిశగా మన ఎమ్మెల్యే శిరీష ఇప్పటికే నిర్మాణాత్మకమైన అడుగులు వేశారని, జిల్లా ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనపై ఆమె ఇప్పటికే పూర్తిస్థాయిలో దృష్టి సారించారని చెప్పారు. కేవలం ప్రకటనలకు పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతూ జిల్లా హోదాకు కావాల్సిన అర్హతలను పలాసకు కల్పిస్తున్నా రని, జిల్లా ఏర్పాటు ప్రక్రియ చదువుకున్న వ్యక్తిగా తెలిసికోవాల్సిన అవసరం ఉందని, ఒక ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలంటే కేవలం నినాదాలు చేస్తే సరి పోదని, దానికి కొన్ని కీలకమైన పారామీటర్స్ (పరమేటర్స్) ఉంటాయని తెలి పారు. రాష్ట్ర స్థాయిలో సమగ్రమైన చర్చ జరగాలి. భౌగోళిక, ఆర్థిక, పరిపాలనా పరమైన అంశాలను ప్రభుత్వం పరిశీలించాలని, మౌలిక సదుపాయాల లభ్యతను అంచనా వేయాలని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా, వ్యవస్థలను పక్కదారి పట్టిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించడం దువ్వాడ శ్రీధర్ (బాబా) బాధ్యతారాహిత్యం కదా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై చేసే పోరాటాలను మేము ఎప్పుడూ స్వాగతిస్తామని, సొంత రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేయడం సరికాదని, ప్రజలందరూ వాస్తవాలను గమనిస్తున్నారు. అనవసరపు ఆందోళనలకు గురికావద్దని కోరుతున్నామన్నారు. అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే శిరీష నాయకత్వంలో పలాస సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్యే శిరీష కృషి పట్టుదల గుర్తించి అభివృద్ధిలో సహకరించాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు బిడ్డ నాగరాజు, లోడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్య నారాయణ, అంబటి కృష్ణమూర్తి, మల్లిపెద్ది నరేంద్ర, జోగి మల్లి, సవర రాంబాబు, కొరికాన శంకర్, కొండె నర్సింహులు, దడియాల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఒడిస్సా వాసి రంగన్న పలాసలో మృతి



**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** పలాసలో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన గురండి గ్రామానికి చెందిన రంగన్న (70) బుధవారం మృతి చెందాడని కాశీబుగ్గ పోలీసులు వెల్లడించారు. ఈ వృద్ధుడు అనారోగ్యం తో పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ సహజ మరణం పొందని చెప్పారు. ఈ విషయాన్ని ఎవరికైనా తెలిస్తే కాశీబుగ్గ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి




**మందస, ఏప్రిల్ 22(వార్త):** సామ్రాజ్యవాదానికి వ్యతిరేకం పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోశాధికారి రైతు కూలీ సంఘం, గిరిజన శక్తి సంక్షేమ సంఘం పిలుపునిచ్చారు. మందస మండలంలోని కొండలోగాంలో లెనిన్ 156 జయంతి, సీపీఐ ఎంఎల్ పార్టీ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. కామ్రేడ్ చారుమజుందార్ ఆధ్వర్యంలోసీపీఐ ఎంఎల్ పార్టీ ఏర్పడిందన్నారు. ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయిల్ చిన్న, చిన్న దేశాలపై కొనసాగిస్తున్న దమనకాండను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం కోశాధికారి కోనేరు రమేష్, గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర నర్సింగరావు, సవర మాధవరావు, సవర భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ ... డేనియా ప్రీతి

**-ప్రభుత్వ కళాశాలల విభాగంలో**

**చరిత్ర గ్రూపులో స్టేట్ టాపర్**





**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ ఏడాది హెచ్ఈసి గ్రూప్ విద్యార్థిని ఎస్. డేనియా ప్రీతి ఇటీవలి ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విభాగంలో టాపర్ గా నిలిచి 'షైనింగ్ స్టార్' అవార్డునకు ఎంపికైంది. హెచ్ఈసీ గ్రూపులో 975/1000 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ప్రథమురాలిగా నిలిచి ఈ పురస్కారానికి అర్హత పొందింది. కాగా ఈ షైనింగ్ స్టార్ స్వస్థలం నందిగాం మండలం విసంపల్లి గ్రామం. తండ్రి నాగేశ్వరరావు ఉపాధ్యాయునిగా ఉన్నారు. తల్లి జయమ్మ గృహిణి. కాగా సివిల్స్ తన లక్ష్యమని, అందుకే చరిత్ర గ్రూప్ తీసుకున్నానని, ఈ దిశగా శ్రమిస్తానని ప్రీతి పేర్కొంది. ప్రిన్సిపల్ నరసింహమూర్తి, అధ్యాపకులు ప్రీతిని అభినందించారు. నన్ను నిరంతరం ప్రోత్సహించిన చరిత్ర అధ్యాపకులు, మధుర చరిత్రకారుడు కొండల మధుబాబు ప్రోద్బలంతోనే అవార్డు లభించిందని ఆమె పేర్కొన్నారు.

## హెచ్ఎం సుందర్ సాల్మన్‌కు ఘన సన్మానం




**మందస, ఏప్రిల్ 22(వార్త):** సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా సేవలందించి ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ చేయనున్న బుగత సుందర్ సాల్మన్ సొండిపూడిలో బుధవారం ఘనంగా ప్రజలు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు కొనియాడారు. దుశ్శాలువాతో కప్పి, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. గ్రామస్తులు ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేస్తూ అంబేద్కర్ విగ్రహం వద్ద ఘన సన్మానం చేశారు. పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన అభిమానులు, ఉపాధ్యాయులు పాఠశాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఫిలిప్స్ డిప్యూటీ ఎండిఓ, మందస విద్యాశాఖ అధికారులు ఎం.లక్ష్మణరావు, భాస్కరరావు, సిహెచ్ నలిని శ్రీనివాసరావు మాజీ సర్పంచ్, తలగాన మా కమ్మమహేష్, ఎస్ఎంసి చైర్ పర్సన్, నగిరి లక్ష్మీనారాయణ, చింతాడ లక్ష్మీనారాయణ , అవుగాన ఈశ్వరరావు, కొత్తపల్లి సాగర్, మూలిపాడు మాజీ సర్పంచ్ గుసిరి వెంకటరావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆడంబరాలకు పోవద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు..!

**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** ఆడంబరాలకు పోవద్దని... ప్రభుత్వ పాఠశాలల ముద్దని, ప్రభుత్వ పాఠశాలను వదిలి డబ్బులు పెట్టి బయటకు వెళ్లాలనుకునే తల్లిదండ్రులు, విద్యార్థులు ఒకసారి ఆలోచించండని, లేనిపోని గొప్పలకు పోయి తిప్పలు పడొద్దు అంటూ వినూత్నంగా బుధవారం వజ్రపుకొత్తూరు మండలం లోని, నగరంపల్లి - జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడి పిలుస్తోంది కార్యక్రమని బుధవారం ప్రచారం చేశారు. కొత్త అడ్మిషన్లు కోసం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని, ఊరు బడిని కాపాడుకుందాం అంటూ.. శివరాంపురం, పూండి గల్లి గ్రామాలలో ర్యాలీగా వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. ఆధునిక సాంకేతిక ఐఎఫ్పి ప్యానల్ తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాల, విశాలమైన క్రీడా మైదానం, ఆంగ్ల మాధ్యమం విద్యతో పాటు ఉచితంగా యూనిఫామ్, బెల్ట్ , షూ, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం నాణ్యమైన బోధన అందించే సుశిక్షితులైన ఉపాధ్యాయులు, కేవలం ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు, విద్యాకమిటీ చైర్మన్ బి. లక్ష్మిపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



## కూతురు ఇంటికని వెళ్లిన తండ్రి అదృశ్యం

**- డోల గ్రామంలో ఆందోళన -పోలీసులకు ఫిర్యాదు**



**పోలాకి, ఏప్రిల్ 22 (వార్త):** కూతురు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన పోలాకి మండలంలో చోటుచేసుకుంది. డోల గ్రామానికి చెందిన ఎన్ని వీరన్న ఈ నెల 8న తన భార్య వెంకటలక్ష్మికి కూతురు ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే పది రోజులైనా ఆయన నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో తల్లి వెంకటలక్ష్మి కూతురికి ఫోన్ చేయగా, ఆయన అక్కడికి వెళ్లలేదని తెలిసింది. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆమె బుధవారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## గుండివిలిపేటలో తల్లిదండ్రుల సమావేశం

**- ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యపై తల్లిదండ్రుల సంతృప్తి**



**నరసన్నపేట, ఏప్రిల్ 22 (వార్త):** నరసన్నపేట మండలం రావులవలస పంచాయతీ గుండివిలిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓలు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు పాల్గొన్నారు. విద్యార్థుల అభ్యాసం, పాఠశాలలో అందిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులతో చర్చించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలకు మంచి విద్య అందుతుందని తెలిపారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం విద్యా ప్రమాణాలు మెరుగయ్యాయని, తమ పిల్లలు బాగా చదువుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పూతి కృష్ణ పాల్గొన్నారు.

## రాజీవ్‌నగర్‌లో గోమాంసం విక్రయాలపై నిర్ధారణ

**-నమూనాలు సేకరించిన పశుసంవర్ధక శాఖ**

**- తదుపరి పరీక్షలకు పంపించిన వైనం**



**నరసన్నపేట, ఏప్రిల్ 22 (వార్త):** రాజీవ్‌నగర్ ప్రాంతంలో గోమాంసం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై మంగళవారం విశ్వహిందూ పరిషత్ సభ్యులు, పోలీసు అధికారులు కలిసి రెండు కేంద్రాలను తనిఖీ చేశారు. విక్రయిస్తున్న మాంసం గోమాంసమేనా అనే అనుమానాల నేపథ్యంలో పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో స్థానిక పశువైద్యాధికారి ఓంకార్ ఘటనాస్థలానికి చేరుకుని నమూనాలు సేకరించారు. పరీక్షల అనంతరం అది గోమాంసమేనని ప్రాథమికంగా నిర్ధారించినట్లు ఆయన తెలిపారు. మరింత స్పష్టత కోసం నమూనాలను ల్యాబ్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై అధికారుల తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## పంపిణీకి సిద్ధంగా చెత్త రిక్షాలు

**-35 పంచాయతీలకు ఒక్కో రిక్షా మంజూరు**



**సారవకోట, ఏప్రిల్ 22 (వార్త):** సారవకోట మండలంలోని 35 పంచాయతీల్లో చెత్త సేకరణను మెరుగుపర్చేందుకు మంజూరైన రిక్షాలను అధికారులు పంపిణీకి సిద్ధం చేశారు. ఇటీవల వచ్చిన రిక్షాల విడి భాగాలను బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అమర్చి పూర్తిస్థాయి రిక్షాలుగా తయారు చేశారు. ప్రతి పంచాయతీకి ఒక్కో రిక్షా మంజూరు చేసినట్లు ఎంపీడీఓ మోహన్ కుమార్ తెలిపారు. ఈ రిక్షాల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. త్వరలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో ఈ రిక్షాలను పంచాయతీలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

## దయనీయ స్థితిలో నీటి నిల్వ వ్యవస్థ

**సారవకోట, ఏప్రిల్ 22 (వార్త):** సారవకోట మండల పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నీటి తొట్టె చెత్తతో నిండిపోయి పనికిరాని స్థితికి చేరింది. మండల పరిషత్ ఆవరణలోని ప్రభుత్వ కార్యాలయాలపై పడే వర్షపు నీటిని సేకరించి భూగర్భ జలాల్లోకి ఇంకే విధంగా ఈ కుంటలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం ఈ నీటి కుంటలు పూర్తిగా చెత్తతో నిండిపోవడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో నీటి సంరక్షణ లక్ష్యం నెరవేరకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి కుంటను శుభ్రపరచి రైన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతున్నారు



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ఘనంగా బెల్లుపడ ఆదర్శ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం



**ఇచ్ఛాపురం ఏప్రిల్ 22 (వార్త):** బెల్లుపడ ఆదర్శ ప్రాథమిక పాఠశాల లో ఘనంగా వార్షికోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ప్రగతి, విద్యా కార్యక్రమాలు నిర్వహణ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చోటుచేసుకున్నాయి. 1 వ తరగతి నుండి 5 వ తరగతి వరకు విద్య లో ప్రతిభ కనబర్చిన విజేతలకు మొదటి ద్వితీయ బహుమతులు, బంగారు, వెండి పథకాలను ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజలక్ష్మి, మండల విద్యాశాఖాధికారి 1 సూర్యారావు , మండల విద్యాశాఖాధికారి 2 విశ్వనాథం, వివిధ కౌన్సిలర్లు, పాఠశాల సిబ్బంది రవి, ఆనంద్, దేవి, డిల్లేశ్వరిమధ్యాహ్న భోజనం ఏజెన్సీ, ఆయా, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కొర్లాం పంచాయతీ మాజీ పాలకవర్గానికి సత్కారం




**సోంపేట, ఏప్రిల్ 22(వార్త):** కొర్లాం గ్రామ పంచాయతీ మాజీ పాలకవర్గానికి గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. పంచాయతీ సర్పంచ్ రామ్ బుడ్డి రమణమ్మ వార్డు సభ్యుల సహకారంతో మంచి ముందుచూపుతో పంచాయితీని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దిన నేపథ్యంలో గ్రామస్తులు దుస్సాలువలు కప్పి మెమెంటోలు అందజేసి సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ తామడ వాసుదేవరావు,మ మాజీ ఎంపీటీసీ రత్నాల వెంకటరమణ, ఏఎంసి వైస్ చైర్మన్ పెద్దింటి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి ఏ.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సెలవులను విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలి

### -గురుకులాల జిల్లా సమన్వయకర్త యశోదలక్ష్మి



**మందస, ఏప్రిల్ 22(వార్త):** విద్యార్థులకు ఈ నెల 24నుంచి వేసవి సెలవులు ప్రభుత్వం ఇవ్వనుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త వై.యశోదలక్ష్మి అన్నారు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం గ్రామం సమీపంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినిలకు జరుగుతున్న బ్రిడ్జి కోర్సును విద్యార్థినిలను అడిగి తెలుసుకున్నారు. వేసవిసెలవుల్లో ఇంటి వద్ద ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హోం వర్క్ వాట్సాప్ గ్రూప్ల ద్వారా ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తర్ఫీదు ఇవ్వాలన్నారు. పాఠశాల తెరిచే సమయానికి మొదటిరోజునే విద్యార్థినిలంతా హాజరుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎల్.లక్ష్మి, ఉపాధ్యాయినిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కేసుపురంలో వైస్సార్సీపీ కార్యకర్తలతో సమావేశం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 22(వార్త):** కేసుపురం పంచాయతీలో పార్టీ కమిటీలు నిర్మాణం, వెరిఫికేషన్ బూత్ లెవెల్ కమిటీ ఏర్పాటు ప్రక్రియ పై వైస్సార్సీపీ నాయకులు చర్చించారు. గ్రామంలోని వివిధ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు గురించి కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త సాడి. శ్యాంప్రసాద్ రెడ్డి, నర్తు నరేంద్ర యాదవ్ , చల్ల దేవరాజు, గుజ్జు ఢిల్లీ రావు, ప్రకాష్, మోహన్ రావు, ఎర్రయ్య, శేఖర్, శేఖర్, వీరస్వామి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

### తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే..

## పిల్లలకు మంచి భవిష్యత్

### -సుందరాపురంలో ప్రభుత్వ బడులపై అవగాహన కార్యక్రమం

**నరసన్నపేట, ఏప్రిల్ 22 (వార్త):** తల్లిదండ్రులలో మార్పు వస్తేనే పిల్లలకు ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని సుందరాపురం జెడ్పీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం నరసన్నపేట మండలం సుందరాపురంలో ఉపాధ్యాయులతో కలిసి ఉపాధి హామీ వేతనదారులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బడుల్లో అందిస్తున్న సదుపాయాలు, నాణ్యమైన బోధన గురించి వివరించారు. గతంలో తల్లిదండ్రులు తరచూ పాఠశాలలకు వచ్చి తమ పిల్లల చదువుపై ఆరా తీసేవారని, ప్రస్తుతం అలాంటి పరిస్థితి తగ్గిపోయిందని తెలిపారు. ఆ అనుబంధాన్ని తిరిగి తీసుకురావడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పిల్లల విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని, వారు చురుకుగా పాల్గొంటేనే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఈ సందర్భంగా సూచించారు.



# అమరుల ఆశయాలను సాధించాలి

### -ప్రజలకు సీపీఐ యంయల్ లిబరేషన్ పార్టీ పిలుపు

### -కోసంగిపురంలో సామాజిక భవనాన్ని ప్రారంభించిన ఆ పార్టీ నేతలు



**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** కోసంగిపురం వద్ద సీపీఐ యంయల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల అవసరాల కోసం ఏర్పాటు చేసిన సామాజిక భవనాన్ని బుధవారం ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు అధ్యక్షతన సామాజిక భవనం ప్రాంగణాన్ని రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ హరనాథ్ ప్రారంభం చేశారు. రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ బుగతా బంగార్రావు కార్మిక వర్గ పతాకాన్ని ఆవిష్కరించారు. లెనిన్ చిత్రపటానికి పూలమాల వేశారు. సమావేశ ప్రాంగాణాన్ని సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఈ కల్లోల భరిత ప్రపంచ పరిస్థితులలో మనం ఈ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నామని, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం రెండవ నెలలోకి ప్రవేశించిందని, అమెరికా సామ్రాజ్యవాదం గ్లోబల్ ఆధిపత్యానికి ఈ యుద్ధం పెద్దమొత్తంలో దెబ్బగా మారిందని, ఇరాన్ గొప్ప స్థైర్యాన్ని ప్రదర్శిస్తూ చనిపోయిన నాయకుల స్థానాలను వెంటనే కొత్తవారితో భర్తీ చేసింది ఇరాన్ ఘణనీయమైన సైనిక నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అమెరికా, ఇజ్రాయిల్ సైనిక లక్ష్యాలపై నిరంతరం దెబ్బలు కొడుతూ హార్మోజ్ జలసంధిని ఒక సమర్ధవంతమైన, వ్యూహాత్మక ఆయుధంగా మలచిందని తెలిపారు. ఈ యుద్ధంతో అన్ని దేశాలలో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వంట చేసుకొనే గ్యాస్ నుంచి సరుకులు ధరలు ఆకాశానికి పెరిగిందని, అనేక దేశాలలో కోట్ల మంది శ్రామిక ప్రజల ఉపాధికి గండిపడిందని, అమెరికా సామ్రాజ్యవాద ఆధిపత్య దాహానికి ప్రపంచంలో అన్ని దేశాలలో పాటు భారతదేశ ప్రజలు ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక కష్టాలకు గురవుతున్నారన్నారు. ఫలితంగా అమెరికా దేశంలోనే ట్రంపు ప్రభుత్వంపై ప్రజాగ్రహం భారీగా వెల్లువెత్తుతుందని తెలిపారు. అమెరికా యురోపియన్ మిత్రదేశాల కూడా ట్రంప్ ప్రభుత్వానికి దూరమవుతూ చాలావరకు అమెరికా యుద్ధానికి సహకరించడానికి నిరాకరిస్తున్నారన్నారు. అమెరికా, ఇజ్రాయిల్‌తో పాటు మోడీ ప్రభుత్వం సన్నిహితంగా, దురదృష్టకరంగా కౌగిలించుకోవడంతో భారత్ కూడా ఈ యుద్ధానికి భారీమూల్యం చెల్లిస్తుందని, యుద్ధానికి ముందే అమెరికా సామ్రాజ్యవాద దురంకారంతో భారతీయ సరుకులపై ఏకపక్షంగా పన్నులు విధించడం వలన మన ఎగుమతులపై ప్రభావం పడిందని, దేశంలో లక్షలాది కార్మికులు ఉపాధి కోల్పోయారున్నారు. మనదేశంలో ప్రత్తి పండించే రైతులు, జీడి రైతులు, ఆక్వా ఉత్పత్తులు, వస్త్ర పరిశ్రమ దెబ్బతిన్నది మన భారత పౌరులను సంకెళ్లు వేసి అమెరికా వెళ్ళగొడితే మోడీ ప్రభుత్వం పన్నెత్తి మాట పలకకుండా మౌనం వహించిందని, సామ్రాజ్యవాదం భారత దేశంలో ఇందనం, ఎరువుల సంక్షోభం సృష్టించి లక్షలాది వలస కార్మికులకు కొవిడ్ పరిస్థితులను తలపిస్తున్నదని, అప్పటిలాగే జీవితం పెద్ద సవాల్‌గా మారిందని, నక్సల్బరి రైతాంగ పోరాటజ్వాలల్లో పుట్టిన కమ్యూనిస్టు పార్టీ మార్కిస్ట్, లెనినిస్ట్ తన 57 ఏళ్ల గమనంలో అనేక సవాలు ఎదుర్కొన్నది అది ఆవిర్భవించిన శైశవ దశలోనే క్రూర నిర్బంధం, భయంకరమైన హింసలేదా చెల్లాచెదురైన పార్టీ శ్రేణులను సమీకరిస్తూ పార్టీని పునః నిర్మించడంలో గాని విప్లవ కల చెదిరి, పార్టీని మిత్రులు విడిపోయినప్పుడు గానీ, ఎమర్జెన్సీ చీకటి రోజులను ఎదుర్కొన్నప్పుడు గానీ, ఎమర్జెన్సీ అనంతరం కొన్ని ప్రాంతాలకు పరిమితమైన పార్టీని అఖిల భారత పార్టీగా నిర్మాణం చేసే సవాళ్లను ఎదుర్కొన్నది, దొర్లిన పొరపాట్లు దిద్దుకుంటూ అది పురోగ మించింది మొత్తం కమ్యూనిస్టు ఉద్యమానికి వారసురాలిగా ఎదిగి దేశంలో ఒకే కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటుకు కృషి సల్పుతూ వేడు దేశంలో నెలకొని ఉన్న ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కొని, భారత సమాజం నుంచి ఫాసిస్టు పోకడలను భావజాలాన్ని నిర్మూలించడానికి పరస్పరం ప్రయోజనములు ఘర్షణ పడుతున్న ఫాసిస్టు వ్యతిరేక శక్తులను ఏకం చేసి ఫాసిస్టు ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలోన్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాంద్ర ప్రకాష్, సహాయకార్యదర్శి వంకల మాదవరావు, సీపీయం నాయకుడు కోనారి మోహనరావు, సీపీఐ నాయకులు సుందర్ లాల్, పోరాట నాయకులు కొమర వాసు, మార్పు పద్మనాభం, దాసరి శ్రీరాములు, అంబటి కృష్ణమూర్తి, మద్దిల రామారావు, బమ్మిడి ఆనంద రావు, పుచ్చ దుర్యోధనరావు తదితరులు పాల్గొన్నారు.

# బడి పిలుస్తోంది ర్యాలీ




**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 22(వార్త):** మండల విద్యాశాఖ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో రాబోయే విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదు కొరకు బడిపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పలాస ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ , మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప విద్యాశాఖాధికారి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని, డ్రాప్ ఔట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని కోరడం జరిగింది. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని ప్రైవేట్ పాఠశాలకు వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని తల్లిదండ్రులకు సూచించడం జరిగింది. మండల విద్యాశాఖాధికారి సూర్యారావు మాట్లాడుతూ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గత 5 రోజుల నుండి పిల్లల నమోదు ప్రక్రియ చాలా వేగంగా జరుగుతుందని తల్లి దండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తద్వారా నాణ్యమైన విద్యను పొందాలని తల్లిదండ్రులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి 2 విశ్వనాథం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.


## పలాస హైవేపై ప్రమాదం

### - పట్టులోగాం యువకుడికి తీవ్ర గాయాలు



**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** పలాస మండలం శాసనం సమీప జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం బుధవారం సంభవించింది. మందస మండలం పట్టులోగాం గ్రామానికి చెందిన సవర భాస్కరరావు బైక్‌పై ప్రయాణిస్తుండగా నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే స్పందించి అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైలు ఢీకొని రిటైర్డ్ సీఆర్పీఎఫ్ ఏఎస్సై మృతి



**పలాస, ఏప్రిల్ 22 (వార్త):** పలాసలో విషాద ఘటన చోటుచేసుకుంది. రైల్వే ట్రాక్ దాటుతుండగా రిటైర్డ్ సీఆర్పీఎఫ్ ఏఎస్సైపై వెనుక నుంచి వచ్చిన రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పలాస రైల్వే స్టేషన్ పరిధిలోని బెండిగేటు సమీపంలో ఈ ప్రమాదం సంభవించింది. నందిగాం మండలం జడ్యాడకు చెందిన భగాతి హిమంత్ రావుగా మృతుడిని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం




**ఇచ్ఛాపురం. ఏప్రిల్ 22 (వార్త):** జ్ఞాన భారతీ పాఠశాలలో వరల్డ్ ఎర్త్ డే- ప్రపంచ ధరిత్రి దినోత్సవం పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండ, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ధరిత్రి దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ డి. కృష్ణమూర్తి రెడ్డి సెక్రటరీ డి. ఇందిరా రెడ్డి స్కూల్ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె. సి. పూరి ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శ్రీధర్, రాజ్యలక్ష్మి, శాంతి, యశోద, జయలక్ష్మి, మీనా, పార్వతి, సరోజినీ, ప్రమీల ప్రియదర్శిని, శిరీష, ఇంటరాక్ట్ క్లబ్ సెక్రటరీ డి. హర్షవర్ధన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ స్వాతి పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రపంచ ధరిత్రి దినోత్సవం సుకళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీతమ్మ, భగవతి, రాధా, రాజేంద్ర కుమార్ త్రిపాఠి, దేవరాజు, సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఇచ్ఛాపురం బస్ స్టాండ్ లో జె సి ఐ ఆధ్వర్యంలో భూమి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ కార్య డిప్యూటీ డి ఈవో విలియమ్స్ ఎం ఈ వో సూర్యా రావు, కమిషనర్ రమేష్. సెక్రటరీ జసంతోష్ సాహు, శణ్ముఖ్ తంగుడు, ఎం. స్వరూప్, సి హెచ్ పవన్, వెచా రాము, జి. దిల్లేష్, శేషు యాదవ్, వి. ప్రేమ్ సాయి, మట్టా శ్రీనివాస్, వి. అభిలాష్, ఏఎస్ఐ ధర్మరాజ్ రెడ్డి, వై. నరేష్, రాహుల్ సాహు, వేధ ఆర్కిటెక్ట్స్ ఉదయ్. మోహన్ వెంకటేష్, ఉర్వశి రాజ్‌కుమార్ లు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts college wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546